# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నారాయణరావుపేట, డిసెంబర్ 1 : మండల పరిధిలోని గుర్రాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు వారు పాఠశాలలో జరిగిన చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

# హామీలు మరిచి విజయోత్సవాలా ?

**చిన్నకోడూర్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్

చిన్నకోడూర్ డిసెంబర్ 1: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ఏడాది పాటు కాలం వెళ్లదీసి విజయోత్సవాలు ఏ విధంగా నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ ప్రశ్నించారు. కనబడిన దేవుళ్ల మీద ఒట్టు పెట్టి ప్రజలను, రైతులను, మోసం చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. చిన్న కోడూరు మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంగాపూర్ సొసైటీ చైర్మన్ కనకరాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో రుణమాఫీ చేస్తానని కనబడ్డ దేవుడు మీద ఒట్టు పెట్టి ఓటు దండుకొని రుణమాఫీ చేయకుండా రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వంపై రాష్ట్రంలో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అభివృద్ధి సంక్షేమాన్ని ముందు వరుసలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు ఉమేశ్ చంద్ర, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్ రెడ్డి, నాయకులు రాజయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# విజయోత్సవాలు కాదు.. ప్రజా వంచనోత్సవాలు

**బీఆర్ఎస్ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ పాల సాయిరాం**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1 : కాంగ్రెస్ పార్టీది ప్రజాపాలన కాదని, దగా పాలన అని.. అవి విజయోత్సవాలు కావని, ప్రజా వంచనోత్సవాలని బీఆర్ఎస్ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ పాల సాయిరాం ఆరోపించారు. సంవత్సర కాలంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, 420 హామీలను తుంగలో తొక్కిందని, అభివృద్ధి మొత్తం అటకెక్కించిందన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే ప్రధాన కర్తవ్యంగా సీఎం పెట్టుకున్నాడు తప్ప.. తెలంగాణ నేలపైన సీఎం రేవంత్‌రెడ్డికి ఏమాత్రం మమకారం లేదన్నారు. దగా పాలన, వంచనోత్సవాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం తెలియని సీఎం రేవంత్‌రెడ్డి అని.. ఎందుకు విజయోత్సవాలు నిర్వహించుకుంటున్నారో వారికే తెలియాలన్నారు. నాయకులు గుండు భూపేశ్, కౌన్సిలర్లు సాయన్నగారి సుందర్, సాయి ఈశ్వర్ గౌడ్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్, నాయకులు మోహిజ్, నాగరాజు, రమేశ్, రాజు, హైమద్, శ్రీకాంత్, రాజశేఖర్, భానుచందర్ పాల్గొన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1 : మండల పరిధిలోని మిట్టపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా బాల్‌రెడ్డి, డైరెకర్లుగా తిరుపతిరెడ్డి, కనకారెడ్డి, రాజిరెడ్డి, సంతోష్, దశమంతరెడ్డి, నర్సింహారెడ్డి, గౌరవ సలహాదారులుగా సంజీవరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాంరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు.


# ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




గజ్వేల్‌లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ తీస్తున్న ఐఎంఏ వైద్యులు

గజ్వేల్, డిసెంబర్ 1 : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం పట్టణంలో ఐఎంఏ, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నరేశ్ బాబు మాట్లాడుతూ ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని, అవగాహన కల్పిస్తే ఎయిడ్స్‌ను దూరం చేయొచ్చన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మరింతగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైద్యులు కుమారస్వామి, నాగ మున్నెయ్య, సాయినాథ్‌రెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# ముగిసిన అంతర్జాతీయ కరాటే సెమినార్



చీఫ్ కోచ్‌తో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్న విద్యార్థులు

చేర్యాల, డిసెంబర్ 1 : కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లాలోని స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ కరాటే సెమినార్‌లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపించినట్లు కరాటే చీఫ్ కోచ్ సెన్సాయి ఎం.ఎస్.పాషా తెలిపారు. సెమినార్‌లో 12 దేశాల నుంచి వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరైన కరాటే చీఫ్ కోచ్ ఎం. పాషా ఉత్తమ ప్రతిభ కనబరిచి వరల్డ్ గ్రాండ్ మాస్టర్ సుసుకి షిహన్ మాసావో కగావా(జపాన్)చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. వివిధ కేటగిరీల్లో తెలంగాణ నుంచి హాజరైన సొప్పరి ఎల్లాదాసు, విజ్జగిరి ప్రభాకర్, సదాబోయిని మహేశ్, ఆస్మా, తరానుమ్, మిర్జా ఆహ్మద్ అలీ, హరిబాహునైన్, మహేర మిరాజ్, లోకేశ్, రితీశ్, చొప్పరి ఆదిత్య, జవవర్షిత్ రెడ్డి, పూజ, కోమల్, స్నేహ రెడ్డి, రాజ్యలక్ష్మి, హారిక ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

# అధ్వానంగా గురుకులాలు

- పదేండ్ల సంక్షేమం, పది నెలల్లో సంక్షోభం
- విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న బీఆర్ఎస్వీ నేతలు
- గురుకులాల సమస్యలు చూసి చలించిన నాయకులు



వంటశాలను పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు అధ్వాన్నంగా తయారయ్యాయని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాలతో పాటు సిద్దిపేట పట్టణంలోని నారాయణరావుపేట బీసీ బాలుర గురుకుల పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతులు ప్రారంభమై ఐదు నెలలైనా ఇప్పటివరకు కాస్మోటిక్ చార్జీలు, షూలు, డ్రెస్‌లు, బెడ్ షీట్లు ఇవ్వలేదని విద్యార్థులు చెప్పారన్నారు. మెనూ ప్రకారం ఉదయం పూట ఇడ్లీ చాలీ చాలనట్లుగా పెడుతున్నారని, మధ్యాహ్నం అన్నం సరిగా ఉడకడం లేదని, నీళ్ల చారు ఉంటుందని విద్యార్థులు వాపోయినట్లు తెలిపారు. హాస్టల్లో బాత్రూమ్ డోర్లు, ఫ్యాన్లు సరిగా లేవని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని బీఆర్ఎస్వీ నాయకులు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 48 మంది విద్యార్థులు వివిధ కారణాలతో మృతిచెందడం బాధకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని గురుకులాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు రెడ్డి యాదగిరి, మహిపాల్‌గౌడ్, రాజు, శ్రీకాంత్, నరేశ్, భానుచందర్, రాజశేఖర్, చందు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# 'మల్లన్న'ఆలయంలో భక్తుల మొక్కులు



పట్నం వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చేర్యాల, డిసెంబర్ 1 : కొమురవెలి మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ప్రతి ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 10 వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పా టు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా మల్లన్న ఆలయంలో దీపాలు వెలిగించి భక్తు లు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలలో మల్లన్న ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు.

**'మల్లన్న' ఆలయంలో ..**

చేర్యాల, డిసెంబర్ 1 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆలయంలో గల నెల రోజులుగా కొనసాగుతున్న కార్తిక దీపోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో బాలాజీ మాట్లాడుతూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కార్తిక మాసంలో నిత్యం దీపాలు వెలిగించి స్వామి వారికి దీపోత్సవం నిర్వహించినట్లు తెలిపారు ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# నాచగిరిలో ముగిసిన కార్తిక దీపోత్సవం



నాచగిరిక్షేత్రంలో ఏర్పాటు చేసిన శ్రీవినాయకస్వామి రూపంలో దీపకాంతులు

వర్గల్,డిసెంబర్1: నాచగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం కార్తిక అమావాస్య చివరి రోజు పురస్కరించుకొని సాయంత్రం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ వినాయకస్వామి రూపంలో దీపాలను వెలించారు. ఆలయ ఈవో, సిబ్బంది ప్రత్యేక జా గ్రత్తలు తీసుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

# సిద్దిపేటలో భగవద్గీత పఠన పోటీలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 1 : చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో యజ్ఞానంద స్వామి పర్యవేక్షణలో సిద్దిపేట సుందర సత్సంగ్ భవన్‌లో ఆదివారం జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు జరిగాయి. భగవద్గీతలోని 5వ అధ్యాయంపై పోటీలను నిర్వహించారు. సిద్దిపేట జిల్లా వ్యాపంగా ఉన్న 15 పాఠశాల నుం చి రెండు వేల మంది విద్యార్థులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్ని ప్రతిభ చాటారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులను అందజేశారు. ఉషాచైతన్య, చిన్మయ మిషన్ కమిటీ సభ్యులు కూర హరికిషన్, లక్ష్మీనారాయణ, చందా వేణుగోపాల్, వారాల అంజయ్య, నర్సింహులు, సిద్ధేశ్వర్, వాసుదేవ్, చిన్మయ్య సభ్యులు పాల్గొన్నారు.

# వైద్యశిబిరానికి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర బరోర్

గజ్వేల్, డిసెంబర్ 1 : సమాజ సేవ ఆత్మ సంతృప్తినిస్తుందని ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర బరోర్ అన్నారు. ఆదివారం ఆర్ అండ్‌ఆర్ కాలనీలో ఎస్‌బీఐ అధికారుల అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకర్, ప్రధాన కార్యదర్శి అంజనేయ ప్రసాద్, సెక్రటరీ జనరల్ కృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ నర్ర సంతోశ్ చందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర బరోర్ మాట్లాడుతూ ఎంత పెద్ద ఉద్యోగం చేసినా సమాజ సేవ చేస్తేనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని, నిరంతర పోటీ జీవితంలో పడి ఆరోగ్యాలను మరిచిపోతున్నామన్నారు. ఉన్నతాధికారులు జితేంద్రకుమార్, వివేక్‌చంద్రజైశ్వాల్, అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు, రాజ్ కిరణ్, రమణ, మహిపాల్, కృష్ణారెడ్డి, బ్యాంకు అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1 : తీవ్రగాయాలతో గుర్తు తెలియని వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ విషమించి మృతి చెందినట్లు సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకా రం.. సిద్దిపేట పట్టణంలోని మిలాన్ గార్డెన్ సమీపంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో పడి ఉండగా అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి 108కు సమాచారం అందించారు. సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృ తుడి ఆచూకీ తెలిసిన వారు సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 1: భార్యతో విడాకులు మంజూరు కావడంతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కిష్టసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన పొడిశెట్టి సంజీవ్ పెయింటర్. నవంబర్ 28న సిద్దిపేట కోర్టులో భార్యతో విడాకులు మంజూరయ్యాయి. స్థానికులు ఆదివారం కిష్టసాగర్ గ్రామ శివారులోని వొడిశెల కుంట వద్ద సంజీవ్ మృతి చెందినట్లుగా గుర్తించారు. ఈ మేరకు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వంతెన నిర్మాణంలో నాణ్యత పాటించాలి



కంకరను పరిశీలిస్తున్న సీపీఐ బృందం

చేర్యాల, డిసెంబర్ 1 : మండలంలోని కడవేర్గు గ్రామ సమీపంలో రూ.2.70 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ బృందం వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పనుల్లో కాంట్రాక్టర్, సూపర్‌వైజర్ కుమ్మక్కై నాసిరకం సిమెంట్, కంకర, ఇసుక, కంకర పొడి వాడుతున్నారని, వీటిని వాడితే కొన్ని రోజులకే పగుళ్లు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు బ్రిడ్జి పనులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు జంగిలి యాదగిరి, కత్తుల భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య, రాజు, మల్లయ్య, రవికుమార్ ఉన్నారు.

# పోలీస్ కిష్టయ్యకు నివాళి

**తెలంగాణ ఉద్యమంలో కిష్టయ్య ప్రాణత్యాగం కీలకం : ముదిరాజ్ సంఘం నేతలు**



గజ్వేల్ : కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహ ఏర్పాటుకు భూమి చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 1: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుడైన పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకొని గజ్వేల్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ.రాజమౌళి, నాయకులు కొట్టాల యాదగిరి, గుంటుక రాజు, మర్కంటి కనకయ్య, గుంటుకశ్రీను, కొట్టాల శ్రీను, చింత శ్రీను, గుంటుక రవి, గడీల సంజయ్, నాగులు, తలారి వెంకట్ పాల్గొన్నారు.

**హుస్నాబాద్‌లో..**

హుస్నాబాద్, డిసెంబర్ 1 : పోలీసు కిష్టయ్య ప్రాణత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందని, ఉద్యమంలో ఆయన ప్రాణత్యాగం ఎంతో కీలకమైనదని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ వల్లపు రాజు, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**మద్దూరులో..**

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 1 : మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు బోయిని శ్రీనివాస్, కనకచంద్రం, బోయిని మనోహర్, గొట్టె పరమేశ్వర్, నార్దాస్ పాండరి, గాజుల నర్సింహులు, నారదాసు మల్లయ్య, బోయిని నరహరి, యామ బాబు, శ్రీరాముల బాలసిద్ధు, ఇట్టబోయిన బాలమల్లు, నర్సయ్య, శ్రీనివాస్ పా ల్గొన్నారు.

**చిన్నకోడూర్‌లో..**

చిన్నకోడూర్, డిసెంబర్ 1: మలిదశ ఉద్యమకారుడు తొలి అమరుడు పోలీసు కిష్టన్న వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీస్ కిష్టన్న వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం చిన్నకోడూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముదిరాజు లు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలయ్య, జంగిటి ఆనందం, కొత్త బాల్ రా జు, ఉప్పరబోయిన శంకర్, ఇట్టమేన శ్రీశైలం, కుందేల దశరథం, ఇట్టమేన బాబు, చంద్రం, లింగం, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వర్ధంతిలో పాల్గొన్న అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్



**చేర్యాలలో..**

చేర్యాల, డిసెంబర్ 1 : పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని ఆదివారం పటణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి యాట యాదగిరి, పట్టణ అధ్యక్షుడు చింతల రవి, సొసైటీ అధ్యక్షుడు యాట నాగయ్య, నాయకులు పుల్లన్నగారి భిక్షపతి, చెక్క మల్లేశం, యాట భిక్షపతి, రవి, వెంకటేశం, పరమేశ్వర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో..**

బెజ్జంకి, డిసెంబర్ 1: ఉద్యమంలో పోలీస్ అమరవీరుడు కిష్టయ్య వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన త్యాగం మరువలేదని కొనియాడారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

# చలికాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్**

సిద్దిపేట, డిసెంబర్ 1 : చలి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు చలి భారీ నుంచి రక్షించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్ సూచించారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

- చిన్నపిల్లలకు స్వెటర్లు, చెవులకు టోపీ, కాళ్లకు సాక్సులు, చేతికి గ్లౌసులు వేయాలి.
- చిన్నారులతో ఉదయం, రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయొద్దు.
- పిల్లలకు అవసరమైన టీకాలు ఇప్పించాలి.
- ముఖ్యంగా ఆస్తమా వ్యాధి ఉన్న వారు, బాగా చలిలో ప్రయాణం చేయకూడదు, చలి తీవ్రతకు గాలిలో గల తేమకు గురి కాకుండా జాగ్రత్త పడాలి.
- రాత్రి వేళలో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు, తలుపులు మూసి వేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజీ బల్బులను వేసుకోవాలి.
- ద్విచక్ర వాహనదారులు చలి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేసినట్లైతే చేతులకు గ్లౌస్‌లు, హెల్మెట్, స్వెటర్లు ధరించాలి, పొడి బారిన చర్మంపై కోల్డ్ క్రీమ్స్, లేదా కొబ్బరి నూనె రాసుకోవాలని సూచించారు.

# ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం కమిటీ ఎన్నిక

హుస్నాబాద్, డిసెంబర్ 1: హుస్నాబాద్ ఎల్ఐసీ బ్రాంచ్ పరిధిలోని ఏజెంట్ల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం పట్టణంలోని బీఎల్ఆర్ బ్యాంకెట్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గట్టు రాములు, ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి, కోశాధికారిగా గౌరవేని కొమురెల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో లియాఫీ కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు గట్టు రాజయ్య, కార్యదర్శి రంగారావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, అలిండియా నాయకుడు బోయినపల్లి ప్రభాకర్‌రావు, సంఘం మాజీ అధ్యక్షుడు పోల్సాని బాపురావు, డివిజన్‌లోని 12 బ్రాంచ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, జోనల్, డివిజన్ నాయకులు, బ్రాంచి ఏజెంట్లు పాల్గొన్నారు.

# పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, డిసెంబర్ 1 : జర్నలిస్టు అనుముల నర్సిరెడ్డి తండ్రి వీరారెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం మండలంలోని ఆకునూరు గ్రామంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు నర్సిరెడ్డిని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నర్సిరెడ్డిని ఫోన్‌లో పరామర్శించి సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్, అరిగే కనకయ్య, పాల బాలరాజు, శనిగరం లక్ష్మణ్, కోతి దాసు, జంగిటి భిక్షపతి, దినేశ్ తివారీలతో పాటు మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ ముస్త్యాల కిష్టయ్య, మాజీ ఎంపీటీసీలు బొమ్మగాని రవిచందర్, సుంకరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

# స్టెనో గ్రాఫర్ ఉద్యోగానికి దరఖాస్తుల పొడిగింపు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 1 : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో స్టెనో గ్రాఫర్ ఉద్యోగానికి దరఖాస్తులను ఈ నెల 20తేదీ వరకు పొడిగించామని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి తెలిపారు. స్టెనోగ్రాఫర్ ఉద్యోగానికి ఇది వరకు దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

**జిల్లా స్థాయిలో ఆకునూరు పాఠశాలకు**

# ప్రథమ బహుమతి



మొదటి బహుమతి అందుకుంటున్న సాయిచరణ్

చేర్యాల, డిసెంబర్ 1 : మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయిచరణ్ రూపొందించిన రైతులకు సహాయ పరికరం నమూన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మొదటి బహుమతి సాధించింది. గైడ్ టీచర్ రవీందర్ ప్రోత్సహంతో సాయిచరణ్ ఉత్తమ నమూనా సాధించి తనతో పాటు పాఠశాలకు పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డీఈవో, ఉన్నతాధికారులు చేతుల మీదుగా సాయిచరణ్ బహుమతి అందుకోవడంతో పాఠశాల హెచ్ఎం. ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

చేర్యాల, డిసెంబర్ 1 : బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీశ్ గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం చైర్‌పర్సన్, కౌన్సిలర్‌తో కలిసి ప్రారంభించారు. కేసీఆర్ పథకాలు దేశానికే దిక్సూచిగా మారాయని, ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ నాగేందర్, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, వార్డు నాయకులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్, డిసెంబర్ 1: మండల పరిధిలోని రిమ్మనగూడలో పేక ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన ఐదుగురిని ఆదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.28,700 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లన స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో, ఫామ్‌హౌస్‌లు, బహిరంగ ప్రదేశాల్లో పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే 8712667445, 8712667 446 లకు సమాచారం అందించాలన్నారు. స మాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

# అన్నప్రసాద వితరణ

హుస్నాబాద్, డిసెంబర్ 1: హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్‌రోడ్డు బస్టాండ్ ఎదురుగా స్థానిక అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.